జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW. DASHANEWS .COM
శనివారం
04-07-2026
సంపుటి 1 సంచిక 221
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195



## టీచర్లకూ బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం

తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం.. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల ఉపాధ్యాయులు, సిబ్బందికీ వర్తింపు

4లో


## ఇంటర్వెల్ ముగిసింది.. అసలు పాలన

# ఇప్పుడేనా?

### 'సంక్షేమం 2.0'తో సెకండాఫ్‌కు సిద్ధమైన రేవంత్ సర్కార్




**దశ, హైదరాబాద్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఇప్పుడు పరిపాలనపై పూర్తి దృష్టి సారిస్తున్నట్లు సంకేతాలు ఇస్తోంది. ఎన్నికలు, ఉపఎన్నికలు, రాజకీయ పరిణామాలతో గడిచిన తొలి అర్ధభాగం తర్వాత ఇప్పుడు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో "సెకండాఫ్" ప్రారంభమైందన్న సందేశాన్ని ప్రభుత్వం బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. ఇటీవల రాష్ట్రంలో భారీ ఎత్తున ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు చేపట్టడం, కీలక శాఖల్లో కొత్త అధికారులను నియమించడం ద్వారా పరిపాలనా వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టింది. పనితీరు ఆధారంగానే అధికారుల కొనసాగింపు ఉంటుందనే సంకేతాలు ప్రభుత్వం పంపిస్తోంది. అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. హైదరాబాద్ మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ, వరంగల్ విమానాశ్రయం, మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, పారిశ్రామిక ప్రాజెక్టులు వంటి భారీ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంటోంది. వీటి అమలుకు కార్యాచరణను వేగవంతం చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. రాజకీయంగా కూడా నియోజకవర్గాల పునర్విభజన, అసెంబ్లీ స్థానాల పెంపుపై చర్చలు కొనసాగుతుండటంతో అధికార పార్టీలోనూ కొత్త ఆశలు కనిపిస్తున్నాయి. టికెట్ ఆశావహులు భవిష్యత్ రాజకీయ సమీకరణలపై దృష్టి సారిస్తున్నారు. సంక్షేమ రంగంలోనూ ప్రభుత్వం కొత్త కార్యక్రమాలకు రూపకల్పన చేస్తోంది. ఇప్పటికే అమలులో ఉన్న పథకాలతో పాటు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, తులం బంగారం వంటి హామీల అమలుపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఎన్నికల నాటికి మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రకటించే అవకాశాలున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే మరోవైపు ప్రజలు మాత్రం ప్రకటనలు, ప్రణాళికలకే పరిమితం కాకుండా ప్రాజెక్టులు ఎప్పుడు పూర్తవుతాయి? సంక్షేమ హామీలు ఎప్పుడు పూర్తిస్థాయిలో అమలవుతాయి? అనే ప్రశ్నలకు సమాధానాలు కోరుతున్నారు. ప్రభుత్వ "సెకండాఫ్"లో ప్రకటిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎంత వేగంగా అమలవుతాయన్నదే ఇప్పుడు రాజకీయంగా కీలకంగా మారింది.




## కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీల మధ్య

# వీధి పోరు

### తెలంగాణలో పీక్స్‌కు చేరిన రాజకీయ వార్..

**దశ, హైదరాబాద్:** తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతోంది. పరస్పర ఆరోపణలు, సవాళ్లు, ప్రతి సవాళ్లతో మొదలైన మాటల యుద్ధం ఇప్పుడు వీధి పోరాటాలకు చేరుకుంది. దీంతో రాష్ట్ర రాజకీయాలు రణరంగాన్ని తలపిస్తుండగా, శాంతిభద్రతల పరిరక్షణ పోలీసులకు సవాల్‌గా మారుతోంది. గురుకుల విద్యాసంస్థల టెండర్లలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ ఆరోపణల నేపథ్యంలో అధికార, ప్రతిపక్షాల మధ్య ఉద్రిక్తత మరింత పెరిగింది. ఆరోపణలు నిరూపించేందుకు బహిరంగ చర్చకు సిద్ధమని మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్ ప్రకటిస్తూ గన్‌పార్క్‌కు

..మిగతా 4వ పేజీలో →



## ఆన్‌లైన్ ఆక్షన్‌లో విమానం విక్రయం


### దేశంలో తొలి రికార్డు సృష్టించిన ఈడీ

దశ, హైదరాబాద్: దేశంలోనే తొలిసారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్వాధీనం చేసుకున్న ఓ విమానాన్ని ఈవేలం ద్వారా విక్రయించింది. హైదరాబాద్ జోనల్ ఈడీ స్వాధీనం చేసుకున్న హాకర్ 800A విమానం రూ.3 కోట్లకు అమ్ముడైంది. ఈ నెల 1న ఎంఎస్‌టీసీ ద్వారా నిర్వహించిన ఈవేలంలో ఈ విమానం విక్రయమైంది. ఈ హాకర్ 800A విమానం ఫాల్కన్ పోంజీ కేసు ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్‌కు చెందినది. నకిలీ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో రూ.792 కోట్ల మేర మోసానికి పాల్పడినట్లు ఈడీ దర్యాప్తులో గుర్తించింది. ఈ కేసు విచారణలో భాగంగా గత మార్చి 7న విమానాన్ని ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పీఎంఎల్ఏ అడ్జుడికేటింగ్ అథారిటీ అనుమతితో చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి ఈవేలంలో విక్రయించారు. వేలం ద్వారా వచ్చిన రూ.3 కోట్లను

..మిగతా 4వ పేజీలో →

## రూ.8.21 లక్షల కోట్ల అప్పులపై రగడ

### కేసీఆర్‌కు భట్టి సవాల్, హరీశ్ కౌంటర్




దశ, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అప్పుల అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. రాష్ట్రంపై రూ.8.21 లక్షల కోట్ల అప్పుల భారం మోపిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించగా, ప్రభుత్వ లెక్కల్లోనే తీవ్ర వైరుధ్యాలు ఉన్నాయని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఎదురుదాడికి దిగారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడిన భట్టి విక్రమార్క.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో మొత్తం రూ.8.21 లక్షల కోట్ల అప్పులు, బకాయిలు రాష్ట్రంపై మోపారని ఆరోపించారు. గత ప్రభుత్వ అప్పుల కారణంగా గత రెండున్నరేళ్లలో అసలు, వడ్డీలు కలిపి రూ.2,08,061 కోట్లు చెల్లించాల్సి వచ్చిందన్నారు. అయినప్పటికీ సంక్షేమ పథకాలను నిలిపివేయలేదని స్పష్టం చేశారు. అధిక వడ్డీ రుణాలను రీస్ట్రక్చరింగ్ చేయడం ద్వారా వార్షిక వడ్డీ భారం రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గిందని తెలిపారు. ఈ భారీ అప్పులపై మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని భట్టి డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా సంగారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందిస్తూ.. రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరస్పర విరుద్ధ లెక్కలు చెబుతోందని విమర్శించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తనకు రాసిన లేఖలో రాష్ట్ర అప్పులు రూ.1,77,058 కోట్లు అని పేర్కొనగా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.3,45,294 కోట్లు అని చెప్పారని గుర్తుచేశారు. ఒకే ప్రభుత్వంలో సీఎం, మంత్రి వేర్వేరు లెక్కలు చెప్పడం ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందని అన్నారు. మరోవైపు రాష్ట్ర అప్పులపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. తన లెక్కలు తప్పని తేలితే మంత్రి, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తానని, బీఆర్ఎస్ నేతల లెక్కలు తప్పైతే వారు కూడా రాజీనామా చేస్తారా? పార్టీని రద్దు చేస్తారా? అని సవాల్ విసిరారు. రాష్ట్రంపై కేసీఆర్ ప్రభుత్వం రూ.8,21,651 కోట్ల అప్పుల భారం మోపిందని ఆయన మరోసారి ఆరోపించారు.

## రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలి

### కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుకు మంత్రి జూపల్లి సవాల్..



**దశ, హైదరాబాద్:** రాష్ట్ర అప్పుల అంశంపై మంత్రి జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుకు బహిరంగ సవాల్ విసిరారు. తాను చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నానని, అవసరమైతే మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేయడానికి సిద్ధమని ప్రకటించారు.శుక్రవారం మీడియాతో మాట్లాడిన మంత్రి జూపల్లి.. రాష్ట్ర అప్పులపై కేటీఆర్, హరీష్‌రావు వేర్వేరు

..మిగతా 4వ పేజీలో →



## లక్ష్మీబాయి బదిలీపై రాజకీయ దుమారం

4లో

### రివెంజ్ పాలిటిక్స్ అంటూ ఆర్ఎస్ ప్రవీణ్ ఆరోపణలు

## డిప్యూటీ సీఎం కాన్వాయ్ రూట్ మార్పు

### కోదాడ ఎస్ఐ గోపాల్‌పై వేటు



**దశ, సూర్యాపేట:** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాన్వాయ్‌ను నిర్ణయించిన మార్గంలో కాకుండా ప్రత్యామ్నాయ రూట్‌లో తీసుకెళ్లిన ఘటనపై కోదాడ రూరల్ ఎస్ఐ గోపాల్‌పై పోలీసు శాఖ చర్యలు తీసుకుంది. అధికారిక షెడ్యూల్‌లో ఉన్న రూట్‌కు

..మిగతా 4వ పేజీలో →

## కూలి పని పేరుతో మోసం..

### బంగారం దోచుకుని మహిళను బావిలోకి తోసిన దుండగుడు



**దశ, కరీంనగర్:** కూలి పని ఇప్పిస్తానని నమ్మించి తీసుకెళ్లిన మహిళ వద్ద బంగారం, నగదు దోచుకుని బావిలోకి తోసేసిన దారుణ ఘటన కరీంనగర్ జిల్లాలో వెలుగుచూసింది. సుమారు 21 గంటలపాటు బావిలోనే చిక్కుకుపోయిన మహిళ ప్రాణాలతో బయట పడడం విశేషం. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కిసాన్‌నగర్‌కు చెందిన గంగాధర లక్ష్మీ (55) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఎప్పటిలాగే

..మిగతా 4వ పేజీలో →



4లో

## రైలు కింద పడి దంపతుల మృతి

### ఘట్‌కేసర్‌లో విషాదం

## భవన నిర్మాణ పనుల్లో ప్రమాదం.. కూలీ మృతి

**దశ, రంగారెడ్డి:** అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా జరిగిన ప్రమాదంలో ఓ కూలీ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామానికి చెందిన ఎల్లంకి రమేష్ (40)ను అదే గ్రామానికి చెందిన మేస్త్రీ నర్సింహా 2026 జూలై 2న కవాడిపల్లి రోడ్డులో నిర్మాణంలో ఉన్న కొత్త ఇంటి పనులకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం సుమారు 3:35 గంటల సమయంలో రమేష్ పనులు నిర్వహిస్తుండగా భద్రతా చర్యలు లేకపోవడంతో తాడు (గోవా)పై నుంచి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర రక్తస్రావ గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే రమేష్‌ను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఎల్లంకి పరమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 'నీలం' కాలనీ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

❖ ఎమ్మార్పీఎస్ నాయకుడు భూమగళ్ల వినోద్ మాదిగ



**దశ, హైదరాబాద్:** ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని చింతల్ నీలం రాజశేఖర్ కాలనీలో నెలకొన్న మౌలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు భూమగళ్ల వినోద్ మాదిగ అధికారులను కోరారు. శుక్రవారం చింతల్ బస్తీలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భూమగళ్ల వినోద్ మాదిగ మాట్లాడుతూ.. కాలనీలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం అనేక మంది నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటి వరకు అర్హులకు ఇళ్లు కేటాయించలేదని ఆరోపించారు. అలాగే దళితుల స్మశాన వాటికలో కొంత స్థలాన్ని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆక్రమించిందని, దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. కాలనీలో శాంతిభద్రతల దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రజలకు భద్రత కల్పించాలని అధికారులను కోరారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రఘుపతి, కృష్ణ, శేఖర్, వెంకటేశ్, మహేశ్, రవి, రమేశ్, లక్ష్మణ్, నగేశ్, నాగరాజు, శివ, సంపత్, శ్రీకాంత్, జల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తార్నాకలో అయోధ్య శ్రీరామ పాదుకల దర్శనం

భక్తులతో కిటకిటలాడిన ఆత్మీయ మహిళా మండలి ప్రాంగణం




**దశ, ఓయూ:** అయోధ్య శ్రీరాముని పవిత్ర పాదుకలు, బాల అయోధ్య రాముడు, శ్రీరాముని ధనస్సు తార్నాకలోని ఆత్మీయ మహిళా మండలి ప్రాంగణానికి చేరుకోవడంతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. చల్లా శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల నడుమ శ్రీరామ పాదుకలకు విశేష పూజలు, హారతులు నిర్వహించగా ఆలయ ప్రాంగణం భక్తిరసంతో మార్మోగింది. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు శ్రీరాముని ఆశీస్సులు పొందుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అయోధ్య నుంచి తీసుకొచ్చిన పవిత్ర పాదుకల దర్శనం కల్పించడం జీవితంలో అరుదైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చల్లా శ్రీనివాస శాస్త్రి, ఆత్మీయ మహిళా మండలి అధ్యక్షురాలు, కవయిత్రి డాక్టర్ లక్కరాజు నిర్మల, కొండపల్లి నరసింహారావు మాట్లాడుతూ, శ్రీరామ భక్తి, సనాతన ధర్మ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లో విస్తరింపజేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన భక్తులు, సేవా బృంద సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## డా. గోనా ఫిలిప్కు హెచ్ఎస్సీ యూనివర్సిటీ సర్టిఫికేట్ ప్రధానం.



**దశ, ఓయూ:** హోరేబు ప్రేయర్ హౌజ్ వ్యవస్థాపకులు రెవరెండ్ గోనా ఫిలిప్ హెచ్ఎస్సీ (హోలీ స్పిరిట్ క్రిస్టియన్ అసోసియేషన్) యూనివర్సిటీ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఫిలిప్పును బిషప్‌గా అధికారింగా ప్రతిష్టించారు. యూనివర్సిటీ బోర్డు సభ్యులు ధృవీకరణ పత్రాన్ని ప్రధానం చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి తైలాభిషేకంతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్సీటియు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ ఆర్చ్ బిషప్ కె. భాస్కరరెడ్డి, బిషప్ డా.ఆనంద్కుమార్, డా. ధన్రాజ్కోట, ఎన్సీసీ తెలంగాణ అధ్యక్షుడు డా. సంజయ్ ఆనంద్, డా. జోషువా, డా. విరాజీ పంత ఇస్రాయేల్. బిషప్ డా. జాన్ విక్టర్ శీలం తదితరులున్నారు.

# కళ్లుండి చూడలేని వ్యక్తి కౌశిక్ రెడ్డి.. కాంగ్రెస్ హామీలు కనిపించడం లేదా?: వొడితల ప్రణవ్



**దశ, హుజురాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాటిని చూడకుండా విమర్శలు చేస్తున్నారని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ విమర్శించారు. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలోని 14, 17 వార్డుల్లో సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని, ఓటరు జాబితాలో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత బీఎల్‌వో, బీఎల్ఏలను సంప్రదించాలని సూచించారు. బీహార్, పశ్చిమ బెంగాల్‌లో జరిగినట్లుగా అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తోందని ప్రణవ్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశాలకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి స్వయంగా హాజరవుతున్నారని, అది కూడా కాంగ్రెస్ ప్రభుత్వ పథకం ద్వారానే సాధ్యమైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు, మహిళలకు వడ్డీలేని రుణాలు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల మౌలిక సదుపాయాల కోసం రూ.30 లక్షలు మంజూరు చేయడంతో పాటు డయాలసిస్ సెంటర్లు, ఇల్లందకుంటలో నూతన రెవెన్యూ భవనం మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్‌గా రెండున్నరేళ్లు అధికారంలో ఉన్న కౌశిక్ రెడ్డి ఈ పనులు ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. ప్రస్తుతం పంపిణీ చేస్తున్న కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అందిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎస్ఐఆర్ కోఆర్డినేటర్లు, వార్డు కోఆర్డినేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఏబీవీపీ ఓయూ శాఖ ఆధ్వర్యంలో "రోడ్డుపై చదువు"

**దశ ఓయూ:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉస్మానియా యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ వినూత్నంగా "రోడ్డుపై చదువు" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రోడ్డుపైనే కూర్చొని తరగతులు నిర్వహిస్తూ, ప్రొఫెసర్ల కొరత కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రతీకాత్మకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఓయూ అధ్యక్షులు గెల్లు శేఖర్ మరియు కార్యదర్శి మోక్షిత్ మాట్లాడుతూ, 100 సంవత్సరాల పైగా చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ నేడు అధ్యాపకుల కొరతతో తీవ్ర విద్యా సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో దాదాపు 941 టీచింగ్ మరియు నాన్‌టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని తెలిపారు. పలు విభాగాల్లో శాశ్వత ప్రొఫెసర్లు లేకపోవడంతో అతిథి అధ్యాపకులపైనే విద్యా బోధన కొనసాగుతోందని, దీనివల్ల బోధన, పరిశోధన, విద్యా ప్రమాణాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రతిష్ఠను కాపాడాలంటే ఖాళీ పోస్టులను భర్తీ చేసి, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు మరియు నాణ్యమైన విద్యను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఏబీవీపీ ఆధ్వర్యంలో మరింత ఉధృతమైన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిటీ సెక్రటరీ పృథ్వితేజ, స్టేట్ జాయింట్ సెక్రెటరీ అలివేలు రాజు, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ హరిప్రసాద్, సిటీ జాయింట్ సెక్రెటరీ దినేష్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తన్మై, నితిన్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆరు గ్యారంటీలు, తులం బంగారం పై సమాధానం చెప్పాలి: ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**దశ, హుజురాబాద్:** ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం హామీపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని వీణవంక మండలంలో నిర్వహించిన కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, రైతుబంధు వంటి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, మూడు బడ్జెట్లు పూర్తయినా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో యూరియా కొరత, తక్కువ వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు అవసరం మరింత స్పష్టమవుతోందని పేర్కొన్నారు. వీణవంక మండలంలోని ఇసుక క్వారీల వల్ల గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, మల్లారెడ్డిపల్లి, దేశాయిపల్లి, పోతిరెడ్డిపల్లి, కోర్కల్, హిమ్మత్‌నగర్, కొండపాక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మానేరు జలాశయం పక్కనే ఉన్నా స్థానికులకు ఇసుక దొరకడం లేదని, ట్రాక్టర్ ఇసుక ధర రూ.7 వేల నుంచి రూ.9 వేల వరకు పెరిగిందని ఆరోపించారు. కాల్వల మరమ్మతులు పూర్తి చేసి 8 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని, రూ.30 కోట్లతో చేపట్టిన వీణవంక రహదారి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## నారాయణ హై స్కూల్‌లో విద్యార్థిపై టీచర్ దాడి .. పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

**దశ, నల్లగొండ:** నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మొదటి తరగతి విద్యార్థిపై టీచర్ దాడి చేశారంటూ తల్లిదండ్రులు ఆరోపించిన ఘటన కలకలం రేపింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నల్లగొండలోని నారాయణ హై స్కూల్‌లో 1వ తరగతి చదువుతున్న శ్రేయన్స్‌ను ఓ టీచర్ తల, ముఖంపై విచక్షణారహితంగా కొట్టడంతో బొడిపె వచ్చిందని ఆరోపించారు. ఇప్పటికే చిన్నారి ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోగా, ఈ ఘటనతో పాఠశాలకు వెళ్లాలంటే భయపడుతున్నాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పాఠశాల యాజమాన్యాన్ని సంప్రదించినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం నల్లగొండ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పాఠశాల యాజమాన్యంపై ఫిర్యాదు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలలను క్రమం తప్పకుండా తనిఖీ



చేయకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు, విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

## తల్లి, కుమారుడు అదృశ్యం.. కేసు నమోదు

**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ తన ఐదేళ్ల కుమారుడితో కలిసి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం, అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన సెలివేరు దానయ్య ఫిర్యాదు మేరకు, తన కుమార్తె *యంజాల అశ్విని (25)*కు ఏడు సంవత్సరాల క్రితం పెద్ద అంబర్‌పేట్‌కు చెందిన యంజాల రాజుతో వివాహం జరిగింది. వీరికి విశాల్ (5) అనే కుమారుడు ఉన్నాడు. దాంపత్య కలహాల కారణంగా సుమారు 15 రోజుల క్రితం అశ్విని తన కుమారుడితో కలిసి తల్లిదండ్రుల ఇంటికి



వచ్చింది. ఈ నెల 26వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో, దానయ్య పీర్ల దర్శనానికి వెళ్లగా, కొద్దిసేపటి తర్వాత అశ్విని కూడా తన కుమారుడితో ఇంటి నుంచి బయటకు వెళ్లిందని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే అనంతరం ఇద్దరూ ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు తల్లి, కుమారుడు అదృశ్యమైన కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపడుతున్నారు.

# రాజకీయ సభలు కాదు.. స్థానిక యువతకు ఉద్యోగాలు కావాలి

❖ కరాటే రాజు నాయక్

**దశ ఓయూ:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించనున్న కృతజ్ఞతా సభకు బదులుగా మిడ్జిల్, ఊర్కొండ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఓయూ జేఏసీ చైర్మన్, తెలంగాణ లంబాడీల ఆత్మగౌరవ వేదిక అధ్యక్షుడు డాక్టర్ కరాటే రాజు నాయక్ డిమాండ్ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎదుట నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.




2006లో మిడ్జిల్ మండలం నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి, తన రాజకీయ జీవితానికి పునాది వేసిన మిడ్జిల్, ఊర్కొండ ప్రాంతాలకు ఇప్పటివరకు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. ప్రతి తండాకు రోడ్లు, ప్రతి గ్రామానికి డ్రైనేజీ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, స్థానిక యువతకు ఉద్యోగాలు, రైతులు, గిరిజనులు, బీసీలు, దళితుల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయా అని నిలదీశారు. ప్రజల సమస్యలు పరిష్కరించకుండా వేలాది మందితో కృతజ్ఞతా సభ నిర్వహించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. మిడ్జిల్, ఊర్కొండ మండలాల సమగ్ర అభివృద్ధికి రూ.1,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తేనే అది నిజమైన కృతజ్ఞత అవుతుందని పేర్కొన్నారు. రాజకీయంగా మీ వెంట నడిచిన స్థానిక యువత ఇప్పటికీ నిరుద్యోగులుగానే ఉన్నారని పేర్కొంటూ, పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. రెండు మండలాల్లో రహదారులు, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ, ఆధునిక ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, డిజిటల్ మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, పీజీ కేంద్రాలు, ఐటీఐలు, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని కోరారు. ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు కేటాయించి రాష్ట్రస్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. దివంగత ధ్యాప గోపాల్ రెడ్డి పేరుతో అంతర్జాతీయ ప్రమాణాల క్రీడా సముదాయం, క్రీడా అకాడమీ, యువత శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

03

జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..

శనివారం
04-07-2026

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ఖమ్మం: వైరా | సత్తుపల్లి | పాలేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వారావుపేట

WWW.DASHANEWS.COM



# కబ్జా స్థలాన్ని అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



❖ ప్రభుత్వ స్థలాల ఆక్రమిస్తే చర్యలు తప్పవు తాసిల్దార్ అద్దంకి నరేష్

**దశ కథనానికి స్పందన**

**దశ, మణుగూరు :** మండలంలోని ఉడుత నేనినగర్ లో ఇంటిగ్రేడ్ పాఠశాల కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు కొంత ఎకరాల స్థలాన్ని కేటాయించారు. కొంతమంది కబ్జాదారులు భూమిని ఆక్రమించారు. ఈ అక్రమాలపై జూన్ నెల 29వ తేదీన దశ పత్రికలో "ప్రభుత్వ భూముల పై అక్రమాల పంజా"...? అనే కథనానికి మణుగూరు తాసిల్దార్ అద్దంకి నరేష్ గురువారం స్పందించారు. ఆర్ ఐ గోపి, సర్వేర్ నరేష్ తో కలిసి అక్రమానికిగురైనస్థలానికిచేరుకొనిఆప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆ భూమిని రెవిన్యూ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా తాసిల్దారు అద్దంకి నరేష్ మాట్లాడుతూ,,,, ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వం కేటాయించిన భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములు కాపాడేందుకు రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా సరే ప్రభుత్వ భూములు అక్రమ ఇస్తే రెవెన్యూ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.



ప్రభుత్వ భూములపై

**అక్రమాల పంజా?**

మొదటి పేజీ తరువాయి

బడా బాబులు అక్రమంగా ప్రభుత్వం ఆక్రమించుకొని ప్లాట్లు చేసి లక్షల రూపాయలను దండుకుంటున్నారు. ఈ బడా బాబులకు రాజకీయ అండదండలు ఉండడంతో వారి ఆడింది ఆట పాడిన పాటగా సాగుతుంది. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన సంబంధిత శాఖలు నిర్లక్ష్యం వహిస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అక్రమార్కులు నకిలీ పత్రాలతో భూములపై హక్కులు చూపిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నట్లు సమాచారం. దీంతో ప్రభుత్వ ఆస్తులకు భారీ నష్టం వాటిల్లడంతో పాటు భవిష్యత్తులో అభివృద్ధి పనులకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అక్రమ ఆక్రమణలపై పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములను గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుని భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతమైనప్పటికీ ఏజెన్సీ చట్టాలకు చోటు పాడుస్తూ దర్జాగా రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ భూములు కాపాడాలని ఆదివాసి నాయకులు పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు అందించిన శూన్యంగా మిగిలిపోయింది. ప్రభుత్వ భూముల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి జియో ట్యాగింగ్ చేయాలని సూచిస్తున్నారు.మండలంలోని అన్ని ప్రభుత్వ భూముల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచి పారదర్శకత పాటించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం అధికారుల బాధ్యత అని, అక్రమాలను అరికట్టడంలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

జ్వాల దశ నిజం.. నిర్భయంగా..
29 Jun 2026 | Page 2
Source: epaper.dashanews.com

# దమ్మపేటలో బీఆర్ఎస్ నాయకులతో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సమావేశం



**దశ, దమ్మపేట:** మండలంలోని లచ్చాపురం గ్రామంలో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు యట్ల వెంకమ్మ ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ఆమె నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయంగా సమావేశమై గ్రామ, మండల రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ, "వచ్చేది ఏ ఎన్నికైనా ఎగిరేది గులాబీ జెండానే" అని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ప్రతి బీఆర్ఎస్ నాయకుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా బూత్ లెవల్ ఏజెంట్లు నిరంతరం జాగ్రత్తగా వ్యవహరిస్తూ ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలిచిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, భవిష్యత్తులో పార్టీ తగిన అవకాశాలను కల్పిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పలువురు స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కూరగాయల వ్యాపారుల సిండికేట్ దోపిడిపై చర్యలు తీసుకోవాలి: తుడుం దెబ్బ

**దశ, మణుగూరు (టౌన్):** ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరు కూరగాయల మార్కెట్‌లో కొందరు వ్యాపారులు సిండికేట్‌గా వ్యవహరిస్తూ కృత్రిమంగా ధరలు పెంచుతున్నారని తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లెం కోటి శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ కు వినతిపత్రం అందించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,,, మార్కెట్‌లో ధరల పెరుగుదలపై ప్రత్యేక విచారణ జరిపి, సిండికేట్‌ను నిర్ధారిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వ్యాపార అనుమతులు రద్దు చేయాలని తెలిపారు . ప్రతి దుకాణంలో అధికారిక ధరల పట్టికను ప్రదర్శించడం తప్పనిసరి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రధాన రహదారిపై కూరగాయల వ్యాపారంతో ట్రాఫిక్ సమస్యలు తీవ్రతరమవుతున్నాయని, ఆక్రమణలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే తుడుం దెబ్బ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అల్లెం కోటి హెచ్చరించారు.

# కాంగ్రెస్ మండల అధ్యక్షులు గా పేరం



**దశ, పినపాక:** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పేరం వెంకటేశ్వరరావును కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పజెప్పిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థులకు గొడుగులు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన గుండాల పోలీసులు




**దశ, గుండాల:** మండలంలోని దామరతోగు గ్రామంలో గుండాల పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుండాల సీఐ తిరుపతి మాట్లాడుతూ విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అలాగే గ్రామస్తులకు విద్య ప్రాధాన్యత, మద్యపానం వంటి దురలవాట్ల నివారణ, గ్రామ భద్రత, నేరాల నివారణపై అవగాహన కల్పించారు. గ్రామాల అభివృద్ధికి ప్రజలు పోలీసులతో సమన్వయంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో గుండాల ఎస్సై శ్రావణ్ కుమార్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మంత్రి అడ్లూరిని కలిసిన ఎమ్మెల్యే పాయం

❖ పినపాక రోడ్లు, వంతెనలకు రూ.37.35 కోట్ల ప్రతిపాదనలు



**దశ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో :** పినపాక నియోజకవర్గంలో రహదారులు, వంతెనల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజన ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల లేమితో ప్రజలు, విద్యార్థులు, రైతులు, అత్యవసర వైద్య సేవలు పొందే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, కరకగూడెం, పినపాక, అల్లపల్లి, గుండాల మండలాల్లో రూ.37.35 కోట్ల అంచనా వ్యయంతో మొత్తం 15 అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సమర్పించారు. వీటిలో బీటీ రోడ్లు, హై లెవల్ బ్రిడ్జిలు, కనెక్టింగ్ బ్రిడ్జిల నిర్మాణాలు ఉన్నాయి. ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు సాధించేందుకు కృషి కొనసాగిస్తానని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.

# కేజీబీవీ హాస్టల్‌లో ఆరోగ్య శిబిరం

❖ విద్యార్థినులకు ఆరోగ్య అవగాహన కల్పించిన డాక్టర్ మధు

**దశ, పినపాక:** మండలం ఎల్చిరెడ్డిపల్లి కేజీబీవీ హాస్టల్‌లో శుక్రవారం జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సీజనల్ వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు సరిగ్గా కడుక్కోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై జానంపేట మెడికల్ ఆఫీసర్ డా. మధు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సరైన హ్యాండ్‌వాష్ విధానాన్ని ప్రదర్శన ద్వారా వివరించారు. అనంతరం హాస్టల్‌లోని వంటగది, భోజనశాల, స్టోర్‌రూమ్, మరుగుదొడ్లు, వసతి గదులను పరిశీలించి పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన సూచనలు అందించారు.ఈ కార్యక్రమాన్ని జానంపేట పీహెచ్‌సీ మెడికల్ సిబ్బంది, పాల్గొన్నారు.





# ఓటర్ల వివరాలు తప్పుల్లేకుండా నమోదు చేయాలి

❖ ఐటీడీఏ పీవో ఈఆర్వో బి. రాహుల్

**దశ, పినపాక:** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని పినపాక నియోజకవర్గ ఈఆర్వో, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచించారు. శుక్రవారం ఆళ్లపల్లి, గుండాల, కరకగూడెం, పినపాక మండలాల బీఎల్వోలు, సూపర్వైజర్లకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎన్యుమరేషన్ ఫారాలు పూరించే సమయంలో ఓటర్ల పూర్తి వివరాలను సేకరించి ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. ఒక్క అర్హ ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా చూడాలని, అవసరమైన పత్రాలు పరిశీలించి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, విద్యార్హత, నివాస ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ తదితర పత్రాలను సిద్ధంగా ఉంచాలని ఓటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీవీటీజీ అధికారి గన్యా నాయక్, తహసీల్దార్లు, ఎన్నికల డీటీలు, బీఎల్వోలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# టీచర్లకూ బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం

## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం.. ప్రభుత్వ బడులు, జూనియర్ కాలేజీల ఉపాధ్యాయులు, సిబ్బందికీ వర్తింపు



**దశ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, బోధనేతర సిబ్బందికి కూడా ఉచితంగా అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్), మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర తొలి ఈకేబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకం అమలులో ఉండేది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అల్పాహార పథకాన్ని కూడా ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇప్పుడు అదే సౌకర్యాన్ని ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బందికి కూడా విస్తరించాలనే నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది కూడా విద్యార్థులతో పాటు ఉచితంగా బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం పొందనున్నారు. దీంతో పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎక్కువ సమయం అందుబాటులో ఉండటంతో పాటు విద్యార్థులతో మరింత సమర్థవంతంగా విద్యా కార్యకలాపాలు నిర్వహించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా, పాఠశాలల్లో అందరికీ ఒకే విధమైన ఆహార సదుపాయం కల్పించడం ద్వారా సమానత్వ భావన పెంపొందుతుందని, విద్యాసంస్థల్లో సానుకూల వాతావరణం ఏర్పడుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఈ నిర్ణయం మరింత ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంలో తీసుకుంటున్న సంస్కరణల్లో భాగంగా ఈ నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘాలు స్వాగతిస్తున్నాయి. విద్యార్థుల సంక్షేమంతో పాటు ఉపాధ్యాయుల సంక్షేమానికీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# లక్ష్మీబాయి బదిలీపై రాజకీయ దుమారం

## రీవెంజ్ పాలిటిక్స్ అంటూ ఆర్ఎస్ ప్రవీణ్ ఆరోపణలు


**దశ, హైదరాబాద్:** తెలంగాణలో సీనియర్ అధికారిణి లక్ష్మీబాయి బదిలీ రాజకీయ దుమారానికి దారితీసింది. వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్‌గా ఉన్న ఆమెను సహకార శాఖ పరిధిలోని హౌసింగ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీపై బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది సాధారణ పరిపాలనా బదిలీ కాదని, రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ప్రభుత్వం తన భార్యను లక్ష్యంగా చేసుకుందని ఆయన ఆరోపించారు. ఇటీవల తన భద్రతా సిబ్బంది, అధికారిక వాహన సౌకర్యాల విషయంలో హైకోర్టులో పాక్షిక ఉపశమనం లభించడంతో దానిని జీర్ణించుకోలేక ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నారని, ఎన్ని ఒత్తిళ్లు తెచ్చినా తాము వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. అయితే కాంగ్రెస్ వర్గాలు ఈ ఆరోపణలను ఖండిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు పూర్తిగా పరిపాలనా ప్రక్రియలో భాగమేనని, ఒక శాఖ నుంచి మరో శాఖకు బదిలీ చేయడం ప్రభుత్వ విచక్షణాధికారమని పేర్కొంటున్నాయి. లక్ష్మీబాయిని ఉద్యోగం నుంచి తొలగించలేదని, కేవలం మరో బాధ్యత అప్పగించామని వివరిస్తున్నాయి. ప్రతి పరిపాలనా నిర్ణయాన్నీ రాజకీయ కోణంలో చూడటం సరికాదని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ఈ ఘటనతో రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. లక్ష్మీబాయి బదిలీ సాధారణ పరిపాలనా చర్యా? లేక రాజకీయ కక్షసాధింపా? అన్న అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.




# ఆరోగ్యానికి బెల్లం టీ..

# సమాజ సేవకు కొత్త దిశ

## నాచారంలో ఘనంగా ప్రారంభమైన "మన తెలంగాణ బెల్లం చాయ్"



**దశ ఓయూ:** ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో "మన తెలంగాణ బెల్లం చాయ్"ను నాచారంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వర్ణహరి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు చౌలా హరిబాబు హాజరై ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ, "ప్రజలు చక్కెరకు బదులుగా బెల్లంతో తయారుచేసిన టీని అలవాటు చేసుకోవాలి. ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణమే మా లక్ష్యం. 'మన తెలంగాణ బెల్లం చాయ్' ద్వారా వచ్చే లాభాలను పేద ప్రజల సంక్షేమం, అన్నదానం, విద్య, వైద్య సహాయం వంటి సేవా కార్యక్రమాలకు వినియోగిస్తాం" అని తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని స్థానికులు, వ్యాపారవేత్తలు, స్నేహితులు అభినందిస్తూ, బెల్లం టీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదల మల్లికార్జున్ గౌడ్, ప్రకాశ్ రెడ్డి, నూతనకంటి రాజు, జంగాం అశోక్, కల్వ యాదగిరి, రామ్‌చందర్, వాసు, శ్రీనివాస్, గద్ద క్రాంతి, ఈ. రాజు, రవి, నర్సింగ్, సుదామల్ల మహేందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభలో పదవులు పొందిన నేతలకు సన్మానం

**దశ సూర్యాపేట ప్రతినిధి :** ఇటీవల తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో పదవులు పొందిన సూర్యాపేట పట్టణానికి చెందిన నాయకులను, ఆర్యవైశ్య డాక్టర్లను ఆర్యవైశ్య సంఘం నాయకులు కుక్కడపు శ్రీనివాసరావు, కలకోట లక్ష్మయ్య ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సూర్యాపేట పట్టణంలోని గీత మందిరంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వర రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో పదవులు పొందిన నాయకులు బండారు రాజా, బొమ్మిడి లక్ష్మీనారాయణ, చల్లా లక్ష్మీకాంత్, మంచాల రంగయ్య, తాటికొండ సీతయ్య, మహిళా నాయకురాలు కలకోట అనిత, తోట కమల, పోతుగంటి సునీత, దేవరశెట్టి ఉమారాణి లను, వైద్యులు దేవరశెట్టి దినేష్, బండారు సుమలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కుక్కడపు శ్రీనివాసరావు, కలకోట లక్ష్మయ్య లు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ లో పదవులు పొందిన నాయకులకు సన్మానం చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఇద్దరు డాక్టర్లను సన్మానించడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అద్యక్షులు వెంపటి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ సూర్యాపేట పట్టణం లోని ఆర్యవైశ్య నాయకులు కలిసిమెలిసి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండా శ్రీధర్, వంగవేటి రమేష్, జూలకంటి నాగరాజు, మంచాల శ్రీనివాస్ గుప్త, తదితరులు పాల్గొన్నారు.

# యువత వ్యాపార రంగంలో రాణించాలి

## రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మొరిశెట్టి నివేదిత లక్ష్మాది

**దశ సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మమత రెస్టారెంట్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ బాలాజీ గిఫ్ట్స్ & ఆర్టికల్స్ షాప్‌ను AICC సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ లు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు రిబ్బన్ కట్ చేసి షాప్‌ను ప్రారంభించి, నిర్వాహకులలైన సందీప్, సాయి లకు శుభాకాంక్షలు తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో నాణ్యమైన వస్తువులు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తే వ్యాపారంలో మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. వ్యాపారం విజయవంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం షాప్ నిర్వాహకులు ముఖ్య అతిథులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య వీధి పోరు

మొదటి పేజీ తరువాయి

చేరుకున్నారు. కేటీఆర్, హరీశ్‌రావు కూడా చర్చకు రావాలని వారు సవాల్ విసిరారు. అదే సమయంలో గన్‌పార్క్‌కు బయలుదేరిన మాజీ మంత్రి హరీశ్‌రావును తెలంగాణ భవన్ వద్ద పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను కూడా పోలీసులు అరెస్టు చేశారు. దీంతో రాజకీయ ఉద్రిక్తత మరింత పెరిగింది. ఈ పరిణామాలపై బీజేపీ కూడా స్పందించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే ఇలాంటి రాజకీయ డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. నిజంగా చర్చకు సిద్ధమైతే తామే వేదిక ఏర్పాటు చేస్తామని వ్యాఖ్యానించారు. మరోవైపు అసెంబ్లీలో చర్చించాల్సిన అంశాలను రోడ్లపైకి తీసుకురావడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన రాజకీయ పార్టీలు పరస్పర సవాళ్లు, అరెస్టులు, నిరసనలతో రాజకీయ వేడిని పెంచుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉండగానే కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు కొత్త మలుపు తిరిగింది. రానున్న రోజుల్లో ఈ రాజకీయ సమరం మరింత ఉధృతం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

# భట్టి కాన్వాయ్ రూట్ మార్పు

మొదటి పేజీ తరువాయి

బదులుగా మరో మార్గంలో కాన్వాయ్‌ను మళ్లించడంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ విషయంపై ఆయన స్వయంగా డీజీపీకి ఫిర్యాదు చేయడంతో పాటు జోనల్ 2 ఐజీ, సూర్యాపేట ఎస్పీల నుంచి వివరణ కోరారు. ఈ నేపథ్యంలో కోదాడ రూరల్ ఎస్ఐ గోపాల్‌ను వీఆర్‌కు అటాచ్ చేస్తూ పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై ఉన్నతాధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.

# ఆన్‌లైన్ ఆక్షన్‌లో విమానం విక్రయం

మొదటి పేజీ తరువాయి

బాధిత పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించనున్నట్లు ఈడీ వెల్లడించింది. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా, దర్యాప్తు కొనసాగుతోంది. ఈడీ స్వాధీనం చేసుకున్న ఆస్తిని పూర్తిగా ఆన్‌లైన్ ఈవేలం ద్వారా విక్రయించడం దేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ విధానం ద్వారా ఆస్తుల విక్రయంలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రభుత్వానికి మెరుగైన ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# కూలి పని పేరుతో మోసం..

మొదటి పేజీ తరువాయి

కూలి అడ్డా వద్దకు వచ్చిన ఆమెను ఓ గుర్తు తెలియని వ్యక్తి కూలి పని ఉందని చెప్పి నుస్తులాపూర్ గ్రామ శివారుకు తీసుకెళ్లాడు. ఉదయం 11 గంటల సమయంలో మహిళ వద్ద ఉన్న అరతులం బంగారం, రూ.4వేల నగదును లాక్కొని ఆమెను బావిలోకి తోసేశాడు. లక్ష్మీ బావిలో ఉన్న తాడును పట్టుకుని పైకి రావడానికి ప్రయత్నించగా, దుండగుడు తాడును కూడా కోసి అక్కడి నుంచి పరారయ్యాడు. అయితే బాధితురాలు బావిలో ఈదుకుంటూ మోటార్ పైపును పట్టుకుని ప్రాణాలు నిలబెట్టుకుంది. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో ఆమె కుమారుడు సందీప్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా గాలింపు చేపట్టినప్పటికీ మొదట ఆమె ఆచూకీ లభించలేదు. మరుసటి రోజు ఉదయం బావి వద్దకు వెళ్లిన భూయజమానికి మహిళ కేకలు వినిపించడంతో గ్రామస్థుల సహాయంతో ఆమెను సురక్షితంగా బయటికి తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలి

మొదటి పేజీ తరువాయి

సందర్భాల్లో వేర్వేరు గణాంకాలు చెప్పారని ఆరోపించారు. ఈ అంశంపై కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుకు లేఖ రాస్తున్నానని, వాట్సాప్, ఈమెయిల్, స్పీడ్‌పోస్ట్ ద్వారా పంపిస్తానని తెలిపారు. తన ఆరోపణలు తప్పని తేలితే రాజీనామా చేస్తానని, కానీ బీఆర్ఎస్ నేతలు చెప్పింది అబద్ధమైతే వారు ఏం చేస్తారో రాతపూర్వకంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ పాలనలో అప్పులు, బకాయిలు కలిపి రాష్ట్రంపై రూ.8.21 లక్షల కోట్లకు పైగా భారం పడిందని జూపల్లి ఆరోపించారు. కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాలకు తమకు సంబంధం లేదని చెప్పడం సరికాదన్నారు. కాళేశ్వరం, పాలమూరు, మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టుల కోసం తీసుకున్న అప్పులను చివరికి ప్రభుత్వమే చెల్లించిందని పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రెస్‌క్లబ్‌కు వస్తానని, అక్కడైనా చర్చకు సిద్ధమని మంత్రి తెలిపారు. తన సవాల్‌ను నిరూపించలేకపోతే బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తారా? అవసరమైతే పార్టీని రద్దు చేస్తారా? అని ప్రశ్నించారు. తన ఆత్మగౌరవాన్ని ఎవరూ ప్రశ్నించలేరని, గతంలో కూడా ఆత్మగౌరవం కోసం పదవికి రాజీనామా చేశానని జూపల్లి స్పష్టం చేశారు. పదవుల కంటే ఆత్మగౌరవమే తనకు ముఖ్యమని, తన సవాల్‌కు ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని పునరుద్ఘాటించారు.

# రైలు కింద పడి దంపతుల మృతి

## ఘట్‌కేసర్‌లో విషాదం

**దశ, ఘట్‌కేసర్:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలోని బీబీనగర్ రైల్వే మార్గంలో గురువారం రాత్రి దంపతులు రైలు కింద పడి మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపాయిపేట గ్రామానికి చెందిన రవికుమార్ (32), శిరీష (28) దంపతులు జీవనోపాధి కోసం కొంతకాలం క్రితం హైదరాబాద్‌కు వచ్చి హయత్‌నగర్ సమీపంలోని కుంట్లూరులో నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి ఎన్ఎఫ్‌సీ సమీపంలో రైలు కింద పడి ఇద్దరూ మృతి చెందారు. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక సమాచారం ప్రకారం దంపతులు కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. అయితే వారి మృతికి అసలు కారణం ఏమిటనే అంశంపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com